నోటిఫికేషన్స్

అర్హత పరీక్ష

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) 2023 నిర్వహణకు విద్యాశాఖ సమాయత్తమైంది. టెట్ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.
అర్హత: డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన వారితోపాటు ప్రస్తుతం ఈ కోర్సుల్లో చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
దరఖాస్తు ఫీజు: రూ.400. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 16.
పరీక్ష తేదీ: సెప్టెంబరు 15. పేపర్-1 ఉదయం 9- 12 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30- సాయంత్రం 5 గంటల వరకు.
ఫలితాల వెల్లడి: సెప్టెంబరు 27న.
వెబ్‌సైట్: https://tstet.cgg.gov.in/

ప్రవేశాలు

కాళోజీ వర్సిటీలో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ప్రవేశపరీక్ష నిర్వహణకు కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది.
కోర్సు వ్యవధి: రెండేళ్లు (నాలుగు సెమిస్టర్లు).
కాంపిటెంట్ అథారిటీ కోటా: 30 సీట్లు
మేనేజ్‌మెంట్ కోటా: 24 సీట్లు **ఫారిన్ నేషనల్స్ కోటా:** 6 సీట్లు
అర్హత: కనీసం 50%తో ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ.
వయసు: పరిమితి లేదు. **ఎంపిక:** ఎంట్రన్స్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13-08-2023.
దరఖాస్తు పత్రాల సమర్పణకు చివరి తేదీ: 14.08.2023.
కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష: 27.08.2023.
ప్రవేశ పరీక్ష ఫలితాల ప్రకటన: 02.09.2023.
వెబ్‌సైట్: https://www.knruhs.telangana.gov.in/

నిట్ సిల్చార్‌లో ఎంటెక్

అసోం రాష్ట్రంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సిల్చార్ ఎంటెక్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
విభాగాలు: సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్.
అర్హత: కనీసం 60% మార్కులతో సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్/ టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.500.
దరఖాస్తుకు చివరి తేదీ: 14.08.2023.
రాత పరీక్ష, ఇంటర్వ్యూ తేదీ: 22.08.2023.
తరగతులు ప్రారంభం: 23.08.2023.
వెబ్‌సైట్:http://www.nits.ac.in/

కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)-2023

ప్రతిష్ఠాత్మకమైన ఐఐఎంల్లో మేనేజ్‌మెంట్ కోర్సులు చేసేందుకు అవకాశం కల్పించే క్యాట్-2023 నోటిఫికేషన్ వెలువడింది.
అర్హత: కనీసం 50% మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45% మార్కులు ఉన్నా అర్హులే). డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2400 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.1200 చెల్లించాలి). **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** 13-09-2023.
పరీక్ష తేదీ: 26-11-2023.
వెబ్‌సైట్: https://iimcat.ac.in/

కేంద్రంలో 1324 జేఈ ఉద్యోగాలు!

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రకటన

కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ శాఖల్లో 1324 జూనియర్ ఇంజినీర్ (జేఈ) ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్రాంచీల్లో డిప్లొమా/ ఇంజినీరింగ్ డిగ్రీ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈమేరకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉద్యోగాల్లో నియమితులైనవారు దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రప్రభుత్వ మంత్రిత్వశాఖ/విభాగాల్లో గ్రూప్-బి (నాన్- గెజిటెడ్) నాన్ మినిస్టీరియల్ జూనియర్ ఇంజినీర్లుగా విధులు నిర్వహిస్తారు.

ఈ ప్రకటన ద్వారా జూనియర్ ఇంజినీర్లుగా నియమితులైనవారికి సెవెన్త్-పే-స్కేలు ప్రకారం రూ.35,400 నుంచి రూ.1,12,400తో మొదటి నెలనుంచే రూ.50 వేల నుంచి రూ.55 వేల జీతం లభిస్తుంది. వీరు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, కేంద్ర ప్రజాపనుల శాఖ, కేంద్ర జలసంఘం, సైనిక ఇంజినీర్ సేవలు, జల వనరుల శాఖ, నదుల అభివృద్ధి, ఓడరేవులు, షిప్పింగ్ మొదలైనచోట్ల తమకు సంబంధించిన విభాగంలో పనిచేసే అవకాశం లభిస్తుంది. అభ్యర్థులు తమకు సంబంధించిన ఇంజినీరింగ్ స్పెషలైజేషన్‌లోనే కేంద్రప్రభుత్వ ఉద్యోగంలో జూనియర్ ఇంజినీర్‌గా నియమితులవుతారు. తమ విభాగంలో పనిచేయడం ప్రతి ఉద్యోగికీ సౌలభ్యమే కాకుండా చేసే ఉద్యోగ విధులూ సంతృప్తికరంగా ఉంటాయి.

కంప్యూటర్ ఆధారిత పరీక్షలో..

ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లుంటాయి. ఒక్కో పేపర్ వ్యవధి రెండు గంటలు

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు
పేపర్-1		
1. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్	50	50
2. జనరల్ అవేర్‌నెస్	50	50
3. పార్ట్-ఎ: జనరల్ ఇంజినీరింగ్ (సివిల్ అండ్ స్ట్రక్చరల్) లేదా పార్ట్-బి: జనరల్ ఇంజినీరింగ్ (ఎలక్ట్రికల్) లేదా పార్ట్-సి: జనరల్ ఇంజినీరింగ్ (మెకానికల్)	100	100
పేపర్-2		
పార్ట్-ఎ: జనరల్ ఇంజినీరింగ్ (సివిల్ అండ్ స్ట్రక్చరల్) లేదా పార్ట్-బి: జనరల్ ఇంజినీరింగ్ (ఎలక్ట్రికల్) లేదా పార్ట్-సి: జనరల్ ఇంజినీరింగ్ (మెకానికల్)	100	300

- పేపర్-1లో మెరుగైన మార్కులు సాధించిన అభ్యర్థులను పేపర్-2 రాయడానికి అనుమతిస్తారు.
- పేపర్-1లో సాధించిన మార్కులు తుది ఫలితాల్లో కూడా ఉపయోగపడతాయి.
- పేపర్-2 పరీక్షకు స్లయిడ్ రూల్, కాలిక్యులేటర్, లాగరిథమ్ టేబుల్స్, స్టీమ్ టేబుల్స్ అనుమతిస్తారు. వీటిని అభ్యర్థులు సొంతంగా తీసుకువెళ్లాలి. వీటిని పేపర్-1 పరీక్షలో అనుమతించరు.
- పేపర్-1, పేపర్-2 రెండు పరీక్షల్లో ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్/ఎలక్ట్రికల్ ఉపకరణాలను అనుమతించరు.

పేపర్-2 ఆన్‌లైన్లో..

ఈసారి నిర్వహించే ఎస్ఎస్‌సీ నియామక పరీక్ష పేపర్-1లో ఎలాంటి మార్పూలేదు. కానీ పేపర్-2లో మాత్రం భారీ మార్పు చోటుచేసుకుంది.
- ఆఫ్‌లైన్‌లో నిర్వహించే పేపర్-2 ఈసారి ఆన్‌లైన్ నిర్వహించనున్నారు.
- పేపర్-2 మార్కులు, సమయంలో ఎలాంటి తేడా లేదు.
- పేపర్-2లో ప్రతి ప్రశ్నకు 3 మార్కులు ఉన్నందున ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కుకు 0.25 చొప్పున.. మొత్తం 0.75 రుణాత్మక మార్కులుంటాయి. కాబట్టి పేపర్-2లో సమాధానాలు గుర్తించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి.
- పూర్వపు పరీక్ష విధానంలో సిద్ధమైనవారు ప్రస్తుత పేపర్-2లో మార్పులకు ఆందోళన చెందకుండా ముందు జరిగే పేపర్-1పై దృష్టి సారించాలి.

ఎవరు అర్హులు?

సివిల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ విభాగాల్లో డిప్లొమా/ఇంజినీరింగ్ డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులు.
వయసు: పోస్టులకు అనుగుణంగా 18- 32 సంవత్సరాల వయసువారు అర్హులు. వివిధ కేటగిరీల అభ్యర్థులకు వయసులో కొంత సడలింపు ఉంటుంది.
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 16.08.2023
ఆన్‌లైన్ ద్వారా పరీక్ష రుసుము చెల్లించడానికి చివరి తేదీ: 16.08.2023
ఆన్‌లైన్ పరీక్ష (పేపర్-1): అక్టోబర్, 2023
ఆన్‌లైన్ పరీక్ష (పేపర్-2): తర్వాత ప్రకటిస్తారు.
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం.

దరఖాస్తు ప్రక్రియ

- ఈ పరీక్ష రాయదలిచిన అభ్యర్థులు http://ssc.nic.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు పూరించి పంపాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తును సులభంగా పూరించడానికి నమూనా దరఖాస్తును పరిశీలించవచ్చు.
- ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు పాస్‌పోర్ట్ ఫొటో, సంతకం అప్‌లోడ్ చేయాలి.
- పరీక్ష ఫీజు రూ.100. బీమ్ యూపీఐ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్..వీటిలో దేని ద్వారానైనా చెల్లించవచ్చు.
- మహిళా అభ్యర్థులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, ఎక్స్‌సర్వీస్‌మెన్ క్యాటగిరీలవారికి పరీక్ష ఫీజులో మినహాయింపు ఉంది.

సన్నద్ధత ఎలా?

- ప్రశ్నపత్రాలు డిప్లొమా సిలబస్ ఆధారంగా సులభంగానే ఉంటాయి. కానీ డిప్లొమాతోపాటు డిగ్రీ విద్యార్థులు కూడా ఈ పరీక్షకు పోటీపడతారు. కాబట్టి డిప్లొమా విద్యార్థులు కొంత ఎక్కువగా శ్రమపడాలి.
- థియరీ ఆధారిత ప్రశ్నలు ఎక్కువ. సరైన సమాధానాలు రాయడంతోపాటు ఎంత త్వరగా సమాధానాలు గుర్తించామనేది ముఖ్యం.
- ఈ పరీక్షలో విజయం సాధించాలంటే మొదట పరీక్ష విధానం, సిలబస్, పరీక్ష స్టాండర్డ్‌ను అవగతం చేసుకోవాలి.
- పరీక్ష రాసేటప్పుడు సమయ పాలన అనేది అత్యంత కీలకం. ప్రణాళికాబద్ధంగా సరైన సాధన అవసరం.
- పరీక్ష సమయంలో అభ్యర్థులు సూటిగా సమాధానం రాయగలిగే ప్రశ్నలను ముందుగా ఎంచుకుని తక్కువ సమయంలో పూర్తిచేయాలి. మిగిలిన వ్యవధిని ఎక్కువ సమయం పట్టే సంఖ్యాపరమైన, సూత్రాధారిత ప్రశ్నలకు కేటాయించవచ్చు.
- పరీక్షకు ఉన్న సమయం దృష్టిలో ఉంచుకుని తగిన ప్రణాళిక రూపొందించుకోవాలి.
- ఇప్పటి నుంచీ రోజుకు కనీసం 8- 10 గంటల సమయాన్ని సాధనకు కేటాయించాలి.
- పరీక్ష సిలబస్‌ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఏ అంశాలు చదవాలో ఏ అంశాలపై ఎక్కువ శ్రద్ధపెట్టాలో అర్థమవుతుంది.
- ప్రామాణిక పుస్తకాలు, అధ్యయన సామగ్రిని (మెటీరియల్) ఎంచుకోవడం ప్రధానం.
- పరీక్షకు సిద్ధమయ్యే క్రమంలో ప్రతి చాప్టర్, ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన ముఖ్యాంశాలను చిన్న పట్టికల ద్వారా సంక్షిప్తంగా తయారు చేసుకోవాలి.
- ప్రిపరేషన్లో అత్యంత కీలకం పునశ్చరణ అని మరవొద్దు. చదివిన ప్రతి అంశాన్నీ పునశ్చరణ చేయాలి.
- సన్నద్ధత క్రమంలో, అనంతరం వీలైనన్ని మాక్ టెస్టులు రాయడం చాలా ముఖ్యం. ఇవి రాసిన తర్వాత చేసిన తప్పులను గుర్తించి సవరించుకోవాలి.
- వీలైనంతవరకూ సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ ఆరోగ్యంపై శ్రద్ధవహించాలి. ఏ సమయంలోనూ ఒత్తిడికి గురికాకూడదు.

ఏ సబ్జెక్టు ఎలా?

1. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్
వెర్బల్, నాన్‌వెర్బల్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ముఖ్యంగా ప్రాబ్లమ్ సాల్వింగ్, డెసిషన్ మేకింగ్, అరిథ్‌మెటిక్, రీజనింగ్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, అనాలిసిస్ అంశాలపై ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా, ఇంజినీరింగ్ చదివిన అభ్యర్థులకు ఈ అంశాలు.. చదివిన పాఠ్యాంశాల్లో లేనప్పటికీ ఎంతో కొంత అవగాహన ఉంటుంది. కాబట్టి సరైన పద్ధతిలో సాధన చేస్తే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది.

2. జనరల్ అవేర్‌నెస్
ఈ విభాగంలో అభ్యర్థి పరిసరాల్లో జరిగే సాధారణ విషయాల అవగాహనను, సమాజంపై అది చూపే ప్రభావాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలుంటాయి. ఇలాంటి అంశాలపై డిప్లొమా, ఇంజినీరింగ్ అభ్యర్థులకు అవగాహన తక్కువగా ఉన్నప్పటికీ దైనందిన వార్తాపత్రికలు, ప్రామాణిక పాఠ్య పుస్తకాలు సమగ్రంగా అధ్యయనం చేస్తే పరీక్షలో ప్రశ్నల సాధన సులువవుతుంది. ఉదాహరణకు చంద్రయాన్-3 వంటి విషయాలు.

3. జనరల్ ఇంజినీరింగ్
ఇందులో సంబంధిత ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రశ్నలు అడుగుతారు. అంటే సివిల్ విద్యార్థులు సివిల్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. అలాగే మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో కూడా ఆయా విభాగాలకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి.
సివిల్ ఇంజినీరింగ్: అభ్యర్థులు పూర్వ ప్రశ్నపత్రాల ద్వారా సరైన అవగాహనను పొంది తమ అభ్యాసాన్ని మొదలుపెట్టడం మంచిది. పాత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే బిల్డింగ్ మెటీరియల్స్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్, సర్వేయింగ్, స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్ సబ్జెక్టుల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడగడాన్ని గమనించవచ్చు. కాబట్టి ఇలాంటి ముఖ్యమైన సబ్జెక్టులను ముందుగా అభ్యసించడం, మాదిరి ప్రశ్నలు సాధనం చేయడం ఎంతో కీలకం.
మెకానికల్ ఇంజినీరింగ్: గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను విశ్లేషిస్తే.. ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ హైడ్రాలిక్ మెషీన్స్, థర్మల్ ఇంజినీరింగ్, ప్రొడక్షన్ ఇంజినీరింగ్ సబ్జెక్టుల్లో ఎక్కువ ప్రశ్నలు రావడం గమనించవచ్చు.
ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్: ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రశ్నపత్రాలను విశ్లేషిస్తే.. ఎలక్ట్రికల్ మెషిన్స్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్, పవర్ సిస్టమ్స్ సబ్జెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు.

- ప్రొ. వై.వి. గోపాలకృష్ణమూర్తి
సీఎండీ, ఏస్ ఇంజినీరింగ్ అకాడెమీ

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: హించ్ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 10
అర్హతలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, స్కెచ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/499ccd

సాఫ్ట్‌వేర్ సేల్స్ కోఆర్డినేషన్
సంస్థ: బ్రాండ్స్ అలెక్సా
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 8
అర్హతలు: సాఫ్ట్‌వేర్ సేల్స్ కోఆర్డినేషన్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/fe7d47

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: వైలెట్ అండ్ పర్పుల్ ఫ్యాషన్ జ్యువెలరీ
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 7
అర్హతలు: ఇంగ్లిష్, హిందీ, తెలుగు మాట్లాడటం, మార్కెటింగ్, ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యాలు
☛ internshala.com/i/7221a8

కస్టమర్ సపోర్ట్ చాట్
సంస్థ: ది అఫర్డబుల్ ఆర్గానిక్ స్టోర్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 11
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యాలు
☛ internshala.com/i/89ab77

విశాఖపట్నంలో

సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: క్లౌడ్ఐ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 15
అర్హతలు: అడోబ్ ఫొటోషాప్, క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్ మార్కెటింగ్, గూగుల్ యాడ్‌వర్డ్స్ నైపుణ్యాలు
☛ internshala.com/i/ec5a01

బెంగళూరు, హైదరాబాద్‌లలో

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: మిల్లెట్ ఎక్స్‌ప్రెస్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 9
అర్హతలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఫొటోగ్రఫీ నైపుణ్యాలు
☛ internshala.com/i/294d5c

గుంటూరులో

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: స్నాజీ అలైన్
స్టైపెండ్: నెలకు రూ.5,000-12,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 7
అర్హతలు: బిజినెస్ రిసెర్చ్, మార్కెటింగ్, ఎంఎస్-ఎక్సెల్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/dc84fc

వరంగల్‌లో

గ్రోత్ మార్కెటింగ్
సంస్థ: పిక్ మై వర్క్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 6
అర్హతలు: గ్రోత్ మార్కెటింగ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
☛ internshala.com/i/c371f9

గుంటుపల్లి, విజయవాడలలో

వెబ్ డెవలప్‌మెంట్
సంస్థ: ఎకంప్‌సిస్ ఇండియా
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 10
అర్హతలు: బూట్‌స్ట్రాప్, సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, జేక్వెరీ, మైఎస్క్యూఎల్, పీహెచ్‌పీ, వర్డ్‌ప్రెస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/cb7b57

గుంటూరు, బాపట్ల, విజయవాడలలో

పైతాన్ డెవలప్‌మెంట్/ వెబ్ డెవలప్‌మెంట్
సంస్థ: నవ్‌సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 8
అర్హతలు: బూట్‌స్ట్రాప్, సీఎస్ఎస్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, పైతాన్, ఎస్క్యూఎల్ నైపుణ్యాలు
☛ internshala.com/i/def6de

మేనేజ్‌మెంట్ ట్రెయినీలుగా చేరతారా?

ఆర్‌సీఎఫ్‌లో అవకాశం

రసాయన, ఎరువుల మంత్రిత్వశాఖకు చెందిన అనుబంధ సంస్థ.. 'రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్)'. ముంబయిలోని ఈ సంస్థ ఎరువుల ఉత్పత్తిలో దేశంలోనే నాలుగో స్థానంలో ఉంది. తాజాగా ఆర్‌సీఎఫ్ఎల్ 124 మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/ బీటెక్/ ఎంబీఏ విద్యార్హతతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తారు. ఆన్‌లైన్ టెస్ట్‌ను భోపాల్, దిల్లీ/దిల్లీ ఎన్‌సీఆర్, లక్నో, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, గువహాటీ, కోల్‌కతా, ముంబయి/న్యూ ముంబయి/ థానే/ ఎంఎంఆర్ రీజియన్, నాగ్‌పుర్‌లలో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ పరీక్ష తేదీని ఇంకా ప్రకటించలేదు. తర్వాత అడ్మిట్‌కార్డ్ ద్వారా పరీక్ష తేదీని తెలియజేస్తారు. ఆర్‌సీఎఫ్ వెబ్‌సైట్ నుంచి ఈ కార్డ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

మేనేజ్‌మెంట్ ట్రెయినీలుగా కెమికల్‌లో-28, బాయిలర్‌లో-10, మెకానికల్‌లో-6, ఎలక్ట్రికల్-10, ఇన్‌స్ట్రుమెంటేషన్-12, సివిల్-1, సేఫ్టీ-4, సీసీల్యాబ్-7, మార్కెటింగ్-37, ఐటీ-3, హెచ్ఆర్-2, హెచ్ఆర్‌డీ-3, అడ్మినిస్ట్రేషన్-1 ఖాళీలు ఉన్నాయి. ప్రత్యేక కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్లు వర్తిస్తాయి. 01.05.2023 నాటికి అభ్యర్థుల గరిష్ఠ వయసు 27 సంవత్సరాలు. గరిష్ఠ వయసులో ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల మినహాయింపు ఉంటుంది. దరఖాస్తు ఫీజు రూ.1000.

ఎంపికైన అభ్యర్థులకు ఏడాది శిక్షణ ఉంటుంది. ఈ కాలంలో నెలకు రూ.30,000 వేతనంగా చెల్లిస్తారు. ఉచిత వసతి, వైద్య సదుపాయాలుంటాయి. ఏడాది శిక్షణ కాలాన్ని విజయవంతంగా పూర్తిచేసిన వారికి వేతనం రూ.40,000 చెల్లిస్తారు. మూలవేతనానికి వీడీఏ, పర్క్స్, హెచ్ఆర్ఏ, ఇతర ప్రోత్సాహకాలూ అన్నీ కలిపి నెలకు రూ.80,000 వరకూ వేతనాన్ని అందుకోవచ్చు.

నియామక పరీక్ష సంగతి?

ఆన్‌లైన్ టెస్ట్ ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో 100 ప్రశ్నలకు ఉంటుంది. దీంట్లో రెండు భాగాలుంటాయి. పార్ట్-1లో డిగ్రీలో చదివిన సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు. పార్ట్-2లో జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ జనరల్ నాలెడ్జ్/ అవేర్‌నెస్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. నెగెటివ్ మార్కులు ఉంటాయి. మొత్తం 150 మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. వ్యవధి 90 నిమిషాలు.

ఆన్‌లైన్ టెస్ట్‌లో సాధించిన మార్కులకు 80 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. ఆన్‌లైన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను 1:7 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపికచేస్తారు. ఇంటర్వ్యూలో అర్హత సాధించిన అభ్యర్థులకు వైద్య పరీక్ష నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

సన్నద్ధత ఇలా

పరీక్ష తేదీనీ ఇంకా వెల్లడించలేదు. కాబట్టి సన్నద్ధతను ఇప్పటినుంచే మొదలుపెడితే చదవడానికి ఎక్కువ సమయం అందుబాటులో ఉంటుంది.
- సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలకు 100 మార్కులను కేటాయించారు. ప్రశ్నలన్నీ చదివిన సబ్జెక్టుల్లోని అంశాల నుంచే ఉంటాయి కాబట్టి వాటిని పునశ్చరణ చేసుకుంటే ఎక్కువ మార్కులను సాధించడం సులువవుతుంది.
- టైమ్‌టేబుల్ వేసుకుని ప్రతిరోజూ అన్ని సబ్జెక్టులకూ సమయాన్ని విభజించాలి. క్లిష్టంగా అనిపించే సబ్జెక్టుకు కాస్త ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. రీజనింగ్, ఆప్టిట్యూడ్ ప్రశ్నలను సాధించడానికి ఎక్కువ సమయం పడుతుంది. వీటిపై ఎక్కువ సమయాన్ని వెచ్చించాలి.
- రోజుకో మోడల్ పేపర్ రాయడాన్ని అలవాటు చేసుకోవాలి. దీంతో నిర్ణీత సమయంలోనే అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాయగలుగుతున్నారో లేదో తెలుస్తుంది. అలాగే ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నారో అర్థమవుతుంది. దాన్ని బట్టి సన్నద్ధతను మెరుగుపరుచుకోవచ్చు.
- బ్యాంకు పరీక్షల పాత ప్రశ్నపత్రాలను సాధన చేయడం వల్లా ప్రయోజనం ఉంటుంది. వీటిల్లోనూ జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ఉంటాయి కాబట్టి వీటిని ప్రయత్నించవచ్చు.

దరఖాస్తుకు చివరి తేదీ: 09.08.2023
వెబ్‌సైట్: http://www.rcfltd.com/

ఏది ఎంచుకోను?

ఇంటర్ (ఎంపీసీ) చదివాను. నాకు ఎన్ఐటీలో మెకానికల్ ఇంజినీరింగ్ చదవాలనుంది. స్నేహితులు కంప్యూటర్ సైన్స్‌దే భవిష్యత్తు అంటున్నారు. ఏది మెరుగు? – స్వప్న

■ మీరు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్య మీది మాత్రమే కాదు. మీలాంటి చాలామంది విద్యార్థులు ఇలానే సతమతమవుతున్నారు. విద్యార్థుల ఆసక్తి ఒకవైపు, మార్కెట్/ తల్లిదండ్రుల/ స్నేహితుల సలహాలు ఒకవైపు. ఈ రెండిటి మధ్య సరైన నిర్ణయం తీసుకోలేక చాలా ఒత్తిడికి కూడా గురవుతున్నారు. ఇప్పుడు మీరు చదవబోయే డిగ్రీ/ కాలేజీ జీవితకాలం మీతో ఉంటాయి. ఏదైనా కోర్సు ఎంచుకొనే ముందు, మీ ఆసక్తి, మీ దీర్ఘకాలిక ఆశయాలు గమనించుకోవాలి. ఇప్పటినుంచి మరో 20/ 30 సంవత్సరాల తరువాత మిమ్మల్ని మీరెలా చూసుకోవాలనుకొంటున్నారు, మీ తరువాతి తరం మిమ్మల్ని ఏవిధంగా గుర్తు పెట్టుకోవాలనుకొంటున్నారు అనేవి పరిగణించండి.

సమాజం అభివృద్ధి చెందాలంటే అన్ని రకాల కోర్సులూ అవసరమే. ఒక్కో విద్యార్థికి ఒక్కోరకమైన విషయంలో ఆసక్తి ఉంటుంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఒక విద్యార్థి ఏ కోర్సు చదవాలనేదాన్ని ఎక్కువగా మార్కెట్ నిర్ణయిస్తోంది. అవసరానికి మించిన సమాచారం అందుబాటులో ఉండటం వల్ల కూడా తల్లిదండ్రులు, విద్యార్థులు సరైన కెరియర్ నిర్ణయాలు తీసుకోలేక ప